




# స్టార్ త్రినేత్రం

PRGI NO: TGTEL/25/A0438

అనుక్షణం అక్షరసత్యం

తెలుగు దినపత్రిక




| వరంగల్ | సంపుటి : 02 | సంచిక : 115 | ఎడిటర్ : డి.శివకృష్ణ | శుక్రవారం | 13-11-2026 | పేజీలు : 04 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|---|
| WARANGAL | VOL : 02 | ISSUE : 115 | EDITOR : D.SHIVAKRISHNA | FRIDAY | 13-11-2026 | PAGES : 04 | PRICE : 2/- |

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, & TG All Districts


# తిరస్కరణల వెనుక వసూళ్ల వ్యూహమా?

## హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం



**◆హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయంలో.. నాలా కన్వర్షన్ ఫైళ్లపై తీవ్ర ఆరోపణలు!**

**◆తొలుత నిబంధనల పేరుతో నిరాకరణ..**

**◆ఆపై మధ్యవర్తుల రంగప్రవేశం?**

**◆ఒక్కో ఫైల్‌కు ఒక్కో రేటు అంటూ ప్రచారం..**

**◆సమగ్ర విచారణకు బాధితుల డిమాండ్!**

**◆కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు, ఏసీబీ దృష్టి సారించాలని విజ్ఞప్తి**

స్టార్ త్రినేత్రం, నిఘా టీమ్:

ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా, పారదర్శకంగా అందించాల్సిన హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం ప్రస్తుతం నాలా కన్వర్షన్ దరఖాస్తుల వ్యవహారంలో వినిపిస్తున్న ఆరోపణలతో చర్చనీయాంశంగా మారుతోంది. భూముల నాలా కన్వర్షన్ కోసం కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్న దరఖాస్తుదారులకు తొలుత నిబంధనల పేరుతో అభ్యంతరాలు చెబుతూ, ఫైళ్లను తిరస్కరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవసరమైన పత్రాలు సమర్పించినప్పటికీ ఏదో ఒక కారణంతో దరఖాస్తులను వెనక్కి పంపుతూ కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### తొలుత నిరాకరణ.. ఆ తర్వాత మధ్యవర్తుల రంగప్రవేశం!

ఫైల్ తిరస్కరణతో ఆందోళనకు గురవుతున్న దరఖాస్తుదారులను కొందరు మధ్యవర్తులు సంప్రదిస్తూ, డబ్బులు చెల్లిస్తే పని పూర్తవుతుందనే విధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. నేరుగా కార్యాలయంలో పరిష్కారం కాని పనులు మధ్యవర్తుల ద్వారా నంప్రదింపులు జరిపిన తర్వాత ముందుకు సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వరిణామాల వెనుక ఎవరున్నారు? మధ్యవర్తులకు కార్యాలయంలోని సిబ్బందితో సంబంధాలు ఉన్నాయా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

### నాలా కన్వర్షన్‌కు ఒక్కో ఫైల్‌కు ఒక్కో రేటా?

భూముల విలువ, ఫైల్ స్వభావం, పనుల పరిష్కారాన్ని బట్టి అనధికారికంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. నిజంగా ఇటువంటి వసూళ్లు జరుగుతున్నాయా? వాటి వెనుక ఎవరెవరి ప్రమేయం ఉంది? దరఖాస్తుల తిరస్కరణకు అనుసరిస్తున్న ప్రమాణా లేమిటి? అనే అంశాలపై సమగ్ర పరిశీలన జరగాల్సిన అవసరం ఉంది. సామాన్య ప్రజలు తమ భూములకు సంబంధించిన పనుల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది.

### జిల్లా ఉన్నతాధికారులు స్పందించరా?

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన దరఖాస్తులను నిర్ణీత ప్రక్రియలో పరిష్కరించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. ఏదైనా ఫైల్ తిరస్కరిస్తే అందుకు గల కారణాలను స్పష్టంగా తెలియజేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హనన్‌వర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఇటీవల పరిష్కరించిన, తిరస్కరించిన నాలా కన్వర్షన్ దరఖాస్తుల వివరాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఫైళ్ల తిరస్కరణకు గల కారణాలు, వాటి పరిష్కారంలో మధ్యవర్తుల పాత్ర, అనధికారికంగా డబ్బులు డిమాండ్ చేశారనే ఆరోపణలపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ ఉన్నతాధికారులు, అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంతోపాటు, తప్పు చేసినట్లు తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# సిద్దిపేటలో నేడు కల్వకుంట్ల కవిత పర్యటన

**తెలంగాణ రక్షణ సేన కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ..**

**పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం**

**కవిత పర్యటనను విజయవంతం చేయాలి**

**: కొడంగల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాజ ప్రభాకర్**



స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

తెలంగాణ రక్షణ సేనను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే దిశగా పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత మరో కీలక అడుగు వేస్తున్నారు. ఇందులో భాగంగా నవంబర్ 13న సిద్దిపేట జిల్లా కేంద్రంలో పర్యటించి పార్టీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. హైదరాబాద్, నిజామాబాద్ తర్వాత సిద్దిపేటలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంస్థాగత విస్తరణలో ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి (తెలంగాణ అమరవీరుల స్తూపం) చౌరస్తాలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. కవిత పర్యటనను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కొడంగల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కులకర్ణి రాజప్రభాకర్ రావు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

### ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పర్యటన ప్రారంభం

కవిత శుక్రవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసం నుంచి సిద్దిపేటకు బయలుదేరనున్నారు. ఉదయం 9 గంటలకు శ్రీ ఉమా పార్థివ కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మినార్ సమీపంలోని జానుల్లా షా దర్గాను సందర్శించి చాదర్ సమర్పిస్తారు. ఆ తర్వాత ఆర్డీవో కార్యాలయం సమీపంలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు.

### పార్టీ కార్యాలయానికి భూమిపూజ.. మీడియాతో ముఖాముఖి

ఉదయం 10 గంటలకు రంగధాంపల్లి చౌరస్తాలో తెలంగాణ రక్షణ సేన నూతన కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఉదయం 11 గంటలకు నిర్మాణ స్థలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడనున్నారు. పార్టీ జిల్లా కార్యాలయ నిర్మాణ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకానుండటంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. సిద్దిపేట పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజప్రభాకర్ రావు కోరారు.

# 'ఒక్కటి కూడా పెండింగ్ ఉండొద్దు'..

## 22ఎ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్లు,.. రిజిస్ట్రార్లకు మంత్రి పొంగులేటి కీలక ఆదేశాలు

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:




ఏండ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా అమలు చేసి దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 22-ఎ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో అమలు పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 22-ఎ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవో 118, జీవో 76లకు **(మిగతా 2లో..)**


# తెలంగాణ పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన..

## 21 మంది ఐపీఎస్‌లు బదిలీ...

## హైదరాబాద్ సీపీగా మహేశ్ భగవత్

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్:

తెలంగాణ పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన చేపడుతూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు పలు కీలక విభాగాలకు కొత్త అధిపతులను నియమిస్తూ, కొందరు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ బదిలీలలో భాగంగా ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్ డీజీగా సజ్జనార్ నియమితులవ్వగా, ఆయనకు ఎస్పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీగా




చారుసిన్హా, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా నాగిరెడ్డి, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీగా సౌమ్య మిశ్రా బాధ్యతలు స్వీకరించనున్నారు. **(మిగతా 2లో..)**

# తెలంగాణ పోలీస్ శాఖలో భారీ ప్రక్షాళన..

(మొదటిపేజీ తరువాయి)

అలాగే జైళ్ల శాఖ డీజీగా (డీజీపీ ప్రిజన్స్) స్వాతి లక్రా, టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా (ఎండీ) అనిల్ కుమార్, గ్రేహౌండ్స్ మరియు ఆక్టోపస్ డీజీపీగా విక్రమ్ సింగ్ మాన్ నియమితులయ్యారు.మరోవైపు.. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్, రైల్ సేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా స్టీఫెన్ రవీంద్రకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. శాంతిభద్రతల (లా అండ్ ఆర్డర్) అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్, పోలీస్ ట్రైనింగ్ అదనపు డీజీపీగా సంజయ్ కుమార్ జైన్ బదిలీ అయ్యారు. ఐజీ స్థాయి అధికారుల విషయానికి వస్తే.. ఇంటెలిజెన్స్ ఐజీగా కార్తికేయ, యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ) ఐజీగా ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, రైల్వే ఐజీగా కే.రమేష్ నాయుడు నియమితులయ్యారు. ఇక రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ విభాగాల జాయింట్ డైరెక్టర్‌గా డి.జోయల్ డేవిస్, టీజీ-టీఎంఏఆర్ఎస్ డివ్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)గా శ్రీ బాలాదేవి బాధ్యతలు చేపట్టనున్నారు.డీఐజీ, డీసీపీ స్థాయిలోనూ ప్రభుత్వం పలు మార్పులు చేసింది. ఇంటెలిజెన్స్ డీఐజీగా ఆర్.భాస్కరన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించగా, జోన్-2 (బాసర) డీఐజీగా కే.నారాయణ నాయక్, డీఐజీ కోఆర్డినేషన్‌గా ఎల్.ఎస్.చౌహాన్ నియమితులయ్యారు. జోన్-8 (జోగులాంబ) డీఐజీగా చందనా దీప్తికి అదనపు బాధ్యతలు కేటాయించడంతో పాటు, జోన్-6 (చార్మినార్) డీఐజీగా అదనపు బాధ్యతలపై ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరితో పాటు హైదరాబాద్ సిటీ డీసీపీగా వి.అరవింద బాబును నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# పిగ్లిపూర్ అభివృద్ధిలో మరో ముందడుగు..
## 20 ఏళ్ల రహదారి సమస్యకు పరిష్కారం

**సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి**
**మాటలకే పరిమితం కాకుండా చేతల్లో అభివృద్ధి చూపించడమే లక్ష్యం: సర్పంచ్**

**స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్‌మెట్:**



పిగ్లిపూర్ గ్రామ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడింది. గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ, ఆధ్వర్యంలో గ్రామంలో పలు చోట్ల నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను విజయవంతంగా పూర్తి చేశారు. గ్రామంలోని జక్కుల యాదమ్మ ఇంటి దగ్గర నుంచి కోట సత్తిరెడ్డి భూమి వరకు, అలాగే మహిదిమియా ఇంటి వరకు నిర్మించిన సీసీ రోడ్ల పనులను గురువారం సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించారు. గత 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతి వీధికి మెరుగైన సౌకర్యాలు కల్పించడమే నా సంకల్పం: సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి**

ఈ సందర్భంగా సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఇబ్బందులను స్వయంగా గుర్తించి, వారి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. “సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే పిగ్లిపూర్ గ్రామ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. గత 20 ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు నేడు పరిష్కారం చూపించడం ఎంతో సంతోషంగా, సంతృప్తిగా ఉంది. కేవలం మాటలకే పరిమితం కాకుండా.. చేతల్లో అభివృద్ధిని చేసి చూపించడమే మా ప్రధాన లక్ష్యం. గ్రామంలోని ప్రతి వీధికి మెరుగైన రోడ్లు, ప్రతి కుటుంబానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే నా సంకల్పం” అని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి (సెక్రటరీ), ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తి నూతన మీడియా కమిటీకి ఎమ్మెల్యే నాగరాజు సన్మానం

**జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**
**కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు.. శాలువాలతో ఘనంగా సత్కారం**

**స్టార్ త్రినేత్రం, హనుమకొండ:**



హసన్‌పర్తి మండల నూతన మీడియా కమిటీ సభ్యులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సన్మానించారు. గురువారం హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి నూతన కమిటీ ఏర్పాటును తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాలు కప్పి సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హసన్‌పర్తి మండల నూతన మీడియా కమిటీకి తన పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ జర్నలిస్టులు నిర్వహిస్తున్న పాత్ర ప్రాధాన్యతను గుర్తిస్తున్నానని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన కమిటీ సభ్యులు ఐక్యంగా పనిచేస్తూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

# ‘ఒక్కటి కూడా పెండింగ్ ఉండొద్దు’..

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి మెమోలు, 22-ఎ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు, యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ అంశాలకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు.

**కలెక్టర్లదే బాధ్యత**

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని పేర్కొన్నారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఇతర సంబంధిత అధికారులు సమావేశమై 22-ఎ సమస్యల పరిష్కారంపై సమీక్షించుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని అంశాలను రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్‌కుమార్ నాయకత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, జారీ చేస్తున్న జీవోలు, మెమోలు కేవలం ప్రభుత్వ ఉత్తర్వులకే పరిమితం కాకూడదని, వాటి అసలు ఉద్దేశం క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు నిజమైన మేలు జరుగుతుందని మంత్రి అన్నారు. ముఖ్యంగా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి ప్రకారం అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**కోర్టు అంశాలపై నివేదిక**

యూఎల్‌సీకి సంబంధించి వివిధ కోర్టులు వెలువరించిన తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్ఎల్‌పీలు) దాఖలు చేసే అంశాలు, ఎస్ఎల్‌పీలు దాఖలు చేయడానికి అవకాశం లేని ఇతర అంశాలన్నింటిపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక అందించాలని మంత్రి సూచించారు. ఈ నివేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. 22-ఎ జాబితాలో ఉన్న ప్రతి భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, సంబంధిత ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిజమైన యజమానులు తమ భూములపై హక్కులు పొందేందుకు అనవసరమైన జాప్యం జరగకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని, అర్హులకు న్యాయం చేసే క్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన భూముల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

# అయ్యప్ప స్వాములకు గుడ్ న్యూస్..
## శబరిమలకు 54 ప్రత్యేక రైళ్లు



**జాతీయం:**

మండల-మకరవిళక్కు తీర్థయాత్ర సీజన్‌లో శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. 2026 నవంబర్ నుండి 2027 జనవరి మధ్య మొత్తం 54 ప్రత్యేక రైళ్లను నడవనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్, చర్లపల్లి, నాందేడ్ స్టేషన్ల నుండి కేరళలోని కొల్లాంకు ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల భక్తులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది.

1. హైదరాబాద్ - కొల్లాం - హైదరాబాద్ (రైలు నం.07193 / 07194)

07193 (హైదరాబాద్ - కొల్లాం): డిసెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో (శనివారాల్లో) రాత్రి 11:10 గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి, సోమవారం ఉదయం 7:15 గంటలకు కొల్లాం చేరుకుంటుంది.

07194 (కొల్లాం - హైదరాబాద్): డిసెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో (సోమవారాల్లో) ఉదయం 10:55 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి, మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

ప్రధాన స్టాప్‌లు : సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పెట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చంగనాశేరి, తిరువల్లా, చెంగన్నూర్, మావేలికర, కాయంకుళం.

2. చర్లపల్లి -- కొల్లాం -- చర్లపల్లి (నల్గొండ, గుంటూరు మీదుగా)

07180 / 07181: రైలు నం. 07180 నవంబర్ 20, 27 మరియు డిసెంబర్ 4, 11, 18, 25 తేదీల్లో (శుక్రవారాల్లో) రాత్రి 11:45 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 7:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నం. 07181 నవంబర్ 22, 29 మరియు డిసెంబర్ 6, 13, 20, 27 తేదీల్లో (ఆదివారాల్లో) ఉదయం 10:55 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి సోమవారం సాయంత్రం 7:00 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

07195 / 07196: రైలు నం. 07195 నవంబర్ 22, 29, డిసెంబర్ 6, 13, 20, 27 మరియు 2027 జనవరి 3, 10, 17 తేదీల్లో (ఆదివారాల్లో) రాత్రి 11:45 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి మంగళవారం ఉదయం 7:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నం. 07196 నవంబర్ 24, డిసెంబర్ 1, 8, 15, 22, 29 మరియు 2027 జనవరి 5, 12, 19 తేదీల్లో (మంగళవారాల్లో) ఉదయం 10:55 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి బుధవారం సాయంత్రం 7:00 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

07197 / 07198: రైలు నం. 07197 డిసెంబర్ 2, 9, 16, 23 తేదీల్లో (బుధవారాల్లో) రాత్రి 11:45 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 7:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నం. 07198 డిసెంబర్ 4, 11, 18, 25 తేదీల్లో (శుక్రవారాల్లో) ఉదయం 10:55 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి శనివారం సాయంత్రం 7:00 గంటలకు చర్లవల్లి చేరుకుంటుంది.

ప్రధాన స్టాప్‌లు: నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పెట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చంగనాశేరి, తిరువల్లా, చెంగన్నూర్, మావేలికర, కాయంకుళం.

3. చర్లపల్లి -- కొల్లాం -- చర్లపల్లి (కాజీపేట, విజయవాడ మీదుగా - రైలు నం. 07199 / 07200)

07199 (చర్లపల్లి - కొల్లాం): రైల్వే ప్రకటన ప్రకారం నవంబర్ 30 మరియు డిసెంబర్ 6, 13 తేదీల్లో రాత్రి 10:40 గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 7:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది (నవంబర్ 30 తేదీకి సంబంధించిన వారం మరియు సమయ వివరాలను బుకింగ్ సమయంలో అధికారిక రైల్వే నోటిఫికేషన్‌తో సరిచూసుకోవాలి).

07200 (కొల్లాం - చర్లపల్లి): 2027 జనవరి 1, 8, 15 తేదీల్లో ఉదయం 10:55 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి శనివారం సాయంత్రం 7:00 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

ప్రధాన స్టాప్‌లు: భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పెట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చంగనాశేరి, తిరువల్లా, చెంగన్నూర్, మావేలికర, కాయంకుళం.

4. నాందేడ్ -- కొల్లాం -- చర్లపల్లి (రైలు నం. 07189 / 07190)

07189 (నాందేడ్ - కొల్లాం): నవంబర్ 15వ తేదీ (ఆదివారం) సాయంత్రం 5:15 గంటలకు నాందేడ్ నుంచి బయలుదేరి, మంగళవారం ఉదయం 7:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది.

07190 (కొల్లాం - చర్లపల్లి): నవంబర్ 17వ తేదీ (మంగళవారం) ఉదయం 10:55 గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి, బుధవారం సాయంత్రం 7:00 గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది.

ప్రధాన స్టాప్‌లు: ముద్ఖేడ్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, చర్లపల్లి (07189 రైలుకు మాత్రమే). నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పెట్టై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూరు, పాలక్కాడ్, త్రిస్సూర్, అలువా, ఎర్నాకులం టౌన్, కొట్టాయం, చంగనాశేరి, తిరువల్లా, చెంగన్నూర్, మావేలికర, కాయంకుళం.

# వైన్ షాపుల దొంగలని చాకచక్యంగా పట్టుకున్న వేములవాడ పోలీస్‌లు

**-గంజాయి విక్రయానికి యత్నించిన ఇద్దరు అరెస్ట్**

**స్టార్ త్రినేత్రం, వేములవాడ :**

వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెక్కపల్లి రోడ్, పెద్దమ్మ గుడి సమీపంలో గంజాయి విక్రయించడానికి వచ్చిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.విశ్వసనీయ సమాచారం మేరకు వేములవాడ టౌన్ ఎస్సై ఎస్. ప్రేమానందం తన సిబ్బందితో కలిసి ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసి, ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.నిందితుల వివరాలు బానోత్ సురేష్33సంవత్సరాలు మహబూబాబాద్ జిల్లా.రాంపెల్లి మహేందర్ 28 సంవత్సరాలు , జగిత్యాల జిల్లా.వారి వద్ద నుంచి 160 గ్రాముల గంజాయి, హోండా డియో స్కూటీ, రెండు వివో మొబైల్ ఫోన్లు, రూ.400 నగదు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు వేములవాడ, కరీంనగర్, సిద్ధిపేట, భువనగిరి, కాజీపేట ప్రాంతాల్లో పలు వైన్ షాపులలో దొంగతనాలకు పాల్పడినట్లు వెల్లడైంది. అలాగే కరీంనగర్‌లోని విఘ్నేశ్వర వైన్స్ దొంగతనానికి సంబంధించిన 72 మద్యం సీసాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈసందర్భంగాకేసునుచాకచక్యంగా ఛేదించి, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై ఎస్. ప్రేమానందం, పోలీస్ సిబ్బంది పీసీ ఇమ్రాన్, పీసీ నరేందర్, సహకరించిన ఇతర సిబ్బందిని వేములవాడ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వీర ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ వీర ప్రసాద్ తెలిపారు.



# అభిమానుల కోలాహలం మధ్య రాజ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

## నారాయణపేట నియోజకవర్గం నుండి భారీగా తరలివచ్చిన శ్రేణులు



**స్టార్ త్రినేత్రం, బి.ఎన్. రెడ్డి నగర్:**

భీష్మ రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ సంఘసేవకులు డాక్టర్ కె. రాజ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని బి.ఎన్. రెడ్డి నగర్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు నారాయణపేట నియోజకవర్గం నుండి అభిమానులు, భీష్మ రాజ్ ఫౌండేషన్ సభ్యులు భారీగా తరలివచ్చారు. అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేయగా, నిర్వాహకులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. భీష్మ రాజ్ ఫౌండేషన్ ద్వారా నారాయణపేట ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు, విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ, బోరుబావుల తవ్వకం, నిత్య అన్నదానం, ఆలయాల అభివృద్ధి వంటి సేవా కార్యక్రమాలతో రాజ్ కుమార్ రెడ్డి పేదల పాలిట ఆపద్బాంధవుడిగా నిలిచారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

# ఆశావర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా...

## అన్నివర్గాలకు న్యాయం చేసేందుకు ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉంది..

## ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి...

## సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసిన ఆశావర్కర్లు....



**స్టార్ త్రినేత్రం, అబ్దుల్లాపూర్‌మెట్:**

ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ఎమ్మెల్యేను కలిసి, తమ సమస్యలను వివరించారు. రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్, సెలవులు, ప్రమోషన్లు, కనీసం వేతనం, డీఏ, తదితర అంశాలను ఆశావర్కర్లు మల్‌రెడ్డి దృష్టి తీసుకువచ్చారు. ఆశావర్కర్లు, వారు అందిస్తున్న సేవలను ప్రజాప్రభుత్వం గుర్తించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తున్న తరుణంలో ఆశాల సమస్యలు సైతం తప్పకుండా పరిష్కారమవుతాయన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని వారికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీఐటీయూ నేత నర్సింహా, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆశావర్కర్లు ఉన్నారు.

# 10వ వార్డులో చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం

## స్వయంగా లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేసిన వార్డు కౌన్సిలర్ సిరి గిరి సంగీత శ్రీకాంత్

**స్టార్ త్రినేత్రం, వేములవాడ:**



వేములవాడ పట్టణంలోని 10వ వార్డులో అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్లను అందజేయడం జరిగింది. న్యాయంగా లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేసిన వార్డు కౌన్సిలర్ సిరిగిరి సంగీత శ్రీకాంత్ ప్రభుత్వవిప్,వేములవాడశాసనసభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలనే సంకల్పంతో ఈకార్యక్రమంనిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పింఛన్లు పొందిన లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రజల సంక్షేమం, పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ప్రజల సంక్షేమమే మా లక్ష్యం అని ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే మా బాధ్యత అని ఈ సందర్భంగా వారు అన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అమలు

## జిల్లాలో 8,209 మందికి నూతన పెన్షన్ మంజూరు

## ఈ నెల 19వ తేది నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో పెన్షన్ నగదు జమ

## రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్

## వేములవాడలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్






**స్టార్ త్రినేత్రం, వేములవాడ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతు న్నదని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ నియోజక వర్గ స్థాయి చేయూత నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని వేములవాడ పట్టణంలోని ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందు గా జయ జయహే తెలంగాణ గీతంతో ప్రారంభించారు. అనం తరం లబ్దిదారులకు పెన్షన్ మంజూ రు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి రోజూ సుమారు 18 గంట లు శ్రమిస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగా ల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తు న్నారని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19వ తేది నుంచి కొత్తగా మంజూరైన పెన్షన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. జిల్లాలో కొత్తగా 8,209 పెన్షన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే జిల్లాలో 1,13,264 మందికి పెన్షన్లుఅందుతున్నాయని, కొత్తగా మంజూరైన పెన్షన్లతో కలిపి మొత్తం 1,21,473 మందికి ప్రతి నెలా పెన్షన్లు అందనున్నాయని వివరించారు. ఇందుకోసం ప్రతి నెలా సుమారు రూ.25.97 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించనుం దని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళ లకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ లాంటి పథకాలను కొనసాగిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఒకవైపు సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అండగా నిలుస్తూ, మరోవైపు మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లా డుతూ.. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు తలసే మియా, సికిల్ సెల్, హిమోఫీలియా గీత కార్మి కులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు నుంచి ఇప్పటికే దరఖాస్తుదారులు స్వీకరించామని తెలిపారు. అర్హుల ఎంపిక కోసం అధికారులతో విచా రణ చేయించామని పేర్కొన్నారు. ఆగస్టు 01 వ తేదీ నుంచి సెప్టెం బర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించామని, ఆయా దరఖాస్తుల ను అధికారులు విచారణ చేయించా మని తెలిపారు. ఈ నెల 18 వ తేదీ వరకు మంజూరు పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు. 19వ తేదీన తర్వాత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమ అవుతాయని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వారి పేరిట ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక వనతులు కల్పించే వనులు చేయిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా స్కూల్ విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే బాధ్యత అప్పగించామని తెలిపారు. వయోవృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వ చట్టం చేసిందని, త్వరలో అమలు కానున్నదని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలుకల తిరుపతి, కచ్చకాయల ఎల్లయ్య, ఫ్యాక్స్ చైర్మెన్లు వకులాభరణం శ్రీనివాస్, బొమ్మెన భాస్కర్, ఏగోలపు శ్రీనివాస్, గనికంటి ప్రభాకర్, పిల్లి కనకయ్య, ఆర్డీఓ కే ఎన్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, మున్సివల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ రూరల్ బీజేపీ మండల కార్యశాల విజయవంతం



**స్టార్ త్రినేత్రం,వేములవాడ:**

వేములవాడ రూరల్ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో మండల కార్యశాల నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజన్న సిరిసిల్ల జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ గారు హాజరయ్యారు.ఈ సందర్భంగా దేవసాని కృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ మండల కార్యశాలలో ప్రధాన కార్యదర్శిలు తోట శేఖర్ వనపర్తి పరశురాములు ఉపాధ్యక్షులు లింగంపల్లి కుంటయ్య సర్పంచులు జంకె మధు కదిరి తిరుపతి ఉపసర్పంచ్ గుంటి వంశీకృష్ణ జిల్లా ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి మల్లారం తిరుపతి కార్యవర్గ సభ్యులు నారెడ్ల వెంకట్ రెడ్డి, బూత్ అధ్యక్షులు సారా నర్సయ్య, నేరెళ్ల రాజయ్య, ఉప్పుల గౌతమ్, రాచర్ల మల్లేశం, లింగంపల్లి రాజు, మారాజు దిలీప్, తీగల రంజిత్, సీనియర్ నాయకులు చెట్టిపల్లి రవికిషోర్, సామోజి గౌతమ్,గోపు రమేష్, చింతకుంట గౌతమ్, సోమినేని అరవింద్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటోనగర్ డంపింగ్ యార్డ్ రోడ్డులో వ్యర్థాల పారబోతపై కఠినంగా వ్యవహరించండి

## అధికారులకు సూచించిన మంత్రి శ్రీధర్ బాబు, మధుయాష్కి గౌడ్

**స్టార్ త్రినేత్రం, మన్సూరాబాద్:**



మన్సూరాబాద్ డివిజన్ ఆటోనగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలో కెమికల్, ఇతర వ్యర్థాల పారబోతపై కఠినంగా వ్యవహరించాలని ఐటీ, ఇండస్ట్రియల్ శాఖ మరియు రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అధికారులకు సూచించారు. గురువారం మన్సూరాబాద్ సౌత్ ఎండ్ పార్కు కాలనీకి విచ్చేసిన శ్రీధర్ బాబు, మధుయాష్కి గౌడ్ లను ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిశారు. ఆటోనగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలో రసాయన వ్యర్థాల పారబోతతో దుర్వాసన.. డ్రైనేజీ నీరు తమ కాలనీల మీదుగా వెళ్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. స్పందించిన వారు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ తో పాటు, డీసీపీతో మాట్లాడి రాత్రివేళ అక్రమంగా వ్యర్థాల పారబోతపై నిఘాపెట్టి కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల మధుయాష్కి గౌడ్ అన్ని విభాగాల అధికారులను పిలిపించి, కాలనీ వాసుల సమక్షంలో సమస్యలను వివరించి పరిష్కరించాలని సూచించారు. ఈ క్రమంలో రోడ్లకు వెంట గతంలో పారబోసిన వ్యర్థాలను అధికారులు తొలగించారు. ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో నిర్మాణ దశలో అసంపూర్తిగా వదిలేసిన ఎస్టీపీని త్వరగా పూర్తి చేయాలని సూచించడంతో ఆ పనులు కూడా పూర్తిగా కావొచ్చాయని మధుయాష్కి ఈ సందర్భంగా వివరించారు.

# నాగోల్‌లో తల్లీకూతుళ్ల అదృశ్యం

## జీతం డబ్బుల కోసం వెళ్లి తిరిగిరాని వైనం

**స్టార్ త్రినేత్రం, నాగోల్:**



ఇళ్లలో పనిచేసిన జీతం డబ్బులు తీసుకొని వస్తానని వెళ్లిన ఓ వివాహిత, తన కుమార్తెతో సహా అదృశ్యమైన సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ వరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నాగోల్ పరిధిలోని జైపురి కాలనీ, రోడ్ నంబర్ 01 (శ్రీ వెంకటేశ్వర వైన్స్ ఎదురుగా) ప్రాంతంలో సంపంగి సురేష్ (39) తన భార్య సంపంగి సుగుణ (35), కుమార్తె సంపంగి నందిని (7)లతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 6న ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో సుగుణ తన కుమార్తె నందినిని వెంటబెట్టుకుని, తాను పనిచేస్తున్న ఇళ్లలో జీతం తీసుకొని వస్తానని భర్తకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది. అయితే, సాయంత్రమైనా వారు తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. ఎక్కడా వారి ఆచూకీ లభించకపోవడంతో భర్త సురేష్ నాగోల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అదృశ్యమైన తల్లీకూతుళ్ల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# పోచబోయిన భవానీ శంకర్ కుటుంబానికి మధు యాష్కి గౌడ్ పరామర్శ

## పరామర్శించిన పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, సురేష్ యాదవ్

**స్టార్ త్రినేత్రం, మన్సూరాబాద్:**



మన్సూరాబాద్ డివిజన్‌కు చెందిన పోచబోయిన లక్ష్మణ్ యాదవ్ కుమారుడు పోచబోయిన భవానీ శంకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడం పట్ల ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్ మధు యాష్కి గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నెల 8వ తేదీన భవానీ శంకర్ గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న మధు యాష్కి గౌడ్, గురువారం మన్సూరాబాద్ డివిజన్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భవానీ శంకర్ చిత్రపటానికి నివాళులర్పించి, మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. భవానీ శంకర్ అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో యాదాద్రి దేవస్థాన పాలక మండలి సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ త్రినేత్రం
PRGI NO: TGTEL/25/A0438
అనుక్షణం అక్షరసత్యం

# అభివృద్ధి ముసుగులో పర్యావరణ విధ్వంసం!

**కాకతీయ యూనివర్సిటీలో అనుమతులకు మించి చెట్ల నరికివేత?**

**కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డీఎన్ఏ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల డిమాండ్**

**వీసీ, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం..**

**అధికారుల నిర్లక్ష్యంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం**

స్టార్ త్రినేత్రం, హనుమకొండ:



అభివృద్ధి పనుల పేరుతో పచ్చని చెట్లను నేలమట్టం చేయడంపై కాకతీయ యూనివర్సిటీలో వివాదం రాజుకుంది. యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల కోసం వర్క్‌షాపుల నిర్మాణానికి కేటాయించిన స్థలంలో అటవీశాఖ అనుమతులకు మించి చెట్లను నరికివేశారంటూ డీఎస్ఏ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. నిర్మాణ పనులకు కేటాయించిన స్థలానికే పరిమితం కాకుండా, దాని వెలుపల ఉన్న చెట్లను సైతం నరికివేశారనే ఆరోపణలు చేస్తూ యూనివర్సిటీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌కు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు.డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ.. మహిళా ఇంజనీరింగ్ కళాశాల వర్క్‌షాపుల నిర్మాణం కోసం కేటాయించిన ప్రదేశంలో అటవీశాఖ నుంచి పొందిన అనుమతులకు మించి కాంట్రాక్టర్ చెట్ల నరికివేతకు పాల్పడ్డారని ఆరోపించారు. నిర్మాణ స్థలానికి వెలుపల కూడా చెట్లు నేలకొరిగాయనే కారణంతో విచ్చలవిడిగా వృక్షాలను తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. జరుగుతున్న అక్రమ నరికివేతను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ యూనివర్సిటీ అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు.

## కాంట్రాక్టర్‌తో పాటు బాధ్యులపైనా చర్యలు తీసుకోవాలి

అభివృద్ధి పనులు చేపట్టడం అవసరమే అయినప్పటికీ పర్యావరణ పరిరక్షణను విస్మరించడం సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు. అనుమతులకు మించి చెట్లను తొలగించిన కాంట్రాక్టర్‌తో పాటు, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహించాల్సిన అవెన్యూ ప్లాంటేషన్ విభాగం అధికారుల పాత్రపైనా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అక్రమంగా చెట్ల నరికివేతకు పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పర్యావరణ పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని వీసీ, రిజిస్ట్రార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాయి, సురేష్, స్వాతి, అనూష, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# అన్నారంలో 45వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు

**నవంబర్ 14 నుంచి 16 వరకు జూనియర్ బాలికల రాష్ట్రస్థాయి పోటీలు**

**ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,ఎంపీ కడియం కావ్య హాజరు**

స్టార్ త్రినేత్రం, పర్వతగిరి:




వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్ ప్రాంగణంలో నవంబర్ 14 నుంచి 16 వరకు 45వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్– 2026 (జూనియర్ బాలికల విభాగం) పోటీలను నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వరంగల్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ పర్యవేక్షణలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.పోటీల ప్రారంభోత్సవానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన జూనియర్ బాలికల జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం, బాలికల్లో క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో వరంగల్ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నాగయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ రాచకొండ అశోక చారి, క్రీడల కన్వీనర్లు గంజి మహేందర్, కోటగిరి రమేష్, కోచ్ శ్రావణ్, పల్లవి మోడల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. అన్నారం గ్రామంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అవకాశం రావడం గ్రామానికి, పల్లవి మోడల్ స్కూల్‌కు గర్వకారణమని నిర్వాహకులు తెలిపారు. క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

# 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఆభరణాలు..

# కరీనాకపూర్ కు వారసత్వంగా ఇంకేం లభించాయంటే?

దీపావళి సందర్భంగా కరీనా కపూర్ ధరించిన 30 క్యారెట్ల పచ్చ ఆభరణంపై వివాదం మొదలైంది. దానిపై ఖురాన్‌లోని 'ఆయత్ అల్ కుర్సీ' వచనం ఉండటంతో కాంగ్రెస్ నేత అబ్బాస్ హఫీజ్ ఆమెకు, స్టైలిస్ట్ రియా కపూర్‌కు నోటీసులు పంపారు. ఈ నేపథ్యంలో సైఫ్ కుటుంబ వారసత్వ ఆస్తులు చర్చకు వచ్చాయి. గురుగ్రామ్‌లోని రూ.800 కోట్ల ప్యాలెస్‌తో పాటు, వీరిద్దరి ఆస్తుల విలువ రూ.1,685 కోట్లుగా సమాచారం. ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కరీనాకపూర్ ఖాన్ ఇప్పుడు వివాదంలో చిక్కుకున్నారు.ఈమె ధరించిన 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఒక రాజవంశ ఆభరణం వివాదానికి దారితీసింది. విషయంలోకి వెళ్తే దీపావళి సందర్భంగా ఈమె ధరించిన 30 క్యారెట్ల పచ్చ లాకెట్ పై పవిత్ర ఖురాన్ లోని 'ఆయత్ అల్ – కుర్సీ' వచనం చెక్కి ఉండడంతో ఇప్పుడు అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నేషనల్ మీడియా కోఆర్డినేటర్ అబ్బాస్ హఫీజ్.. కరీనాకపూర్ అలాగే ఆమె స్టైలిస్ట్ రియా కపూర్లకు నోటీసులు పంపించడంతో ఈ వివాదం కాస్త సోషల్ మీడియాలో ఒక్కసారిగా వైరల్ అయిపోయింది. ఈ ఒక్క ఘటనతో కరీనాకపూర్ కి తన భర్త కుటుంబం నుండి ఇంకెన్ని ఆస్తులు వారసత్వంగా లభించాయి అనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పటౌడీ, భోపాల్ రాజవంశానికి చెందిన సైఫ్ అలీ ఖాన్.. రాజకుటుంబం ద్వారా పొందిన వారసత్వ ఆభరణాలు, రాజ భవనాల హక్కులు సైఫ్ అలీ ఖాన్ ద్వారా తన భార్య కరీనాకపూర్ ఖాన్ కి కూడా సంక్రమించాయి. నిజానికి వీరి స్థిరాస్తుల వారసత్వం చుట్టూ కొన్ని చట్టపరమైన, ఆర్థిక వివాదాలు చుట్టుముట్టిన విషయం తెలిసిందే. ఇలాంటి సమయంలో రాజ కుటుంబం నుండి వీరికి లభించిన ఆస్తుల వివరాలు అన్ని ఇప్పుడు వైరల్ గా మారాయి. భోపాల్ చివరి నవాబ్ ఆయన హమీదుల్లా ఖాన్ కాలం నాటి అనగా 200 ఏళ్ల సంవత్సరాల క్రితం నాటి అరుదైన వజ్రాల ఆభరణం 'కల్గి' కరీనా కపూర్ కి వారసత్వంగా లభించింది. అయితే ఈ ఆభరణాన్ని 2012లో సైఫ్ అలీ ఖాన్ తన వివాహ సమయంలో ధరించగా.. 2026 దీపావళి వేడుకల్లో కరీనాకపూర్ ధరించి ఇప్పుడు వివాదంలో చిక్కుకుంది. ఈ 30 క్యారెట్ల అరుదైన బంగారు ఆభరణం సైఫ్ అలీ ఖాన్ నానమ్మ సాజిదా సుల్తాన్ కరీనాకపూర్ కి వారసత్వంగా అందించారు. దీంతోపాటు హర్యానాలోని గురుగ్రామ్ లో 10 ఎకరాల విస్తీర్ణంలో 150 గదులతో నిర్మించబడిన సుమారుగా



రూ.800 కోట్ల విలువైన రాజభవనం కూడా ఉంది. నిజానికి ఈ ప్యాలెస్ సైఫ్ కి వారసత్వంగా నేరుగా లభించలేదు. సైఫ్ తండ్రి మన్సూర్ అలీ ఖాన్ మరణానికి ముందు దీనిని నీమ్రానా హోటల్స్ గ్రూప్ కి అద్దెకు ఇచ్చారు. ఆ తర్వాత సైఫ్ అలీ ఖాన్ తన సినిమాల ద్వారా వచ్చిన సంపాదనతో ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించి.. ఆ ప్యాలెస్ ను సొంతం చేసుకున్నారు. ఇకపోతే సైఫ్, కరీనా కపూర్ తో పాటు వారి పిల్లలకి కూడా ఈ ప్యాలెస్ ఉమ్మడి ఆస్తిగా నిలిచింది.మరొకవైపు వారసత్వ ఆస్తులతో పాటు సైఫ్ అలీ ఖాన్, కరీనాకపూర్ ఇద్దరు కూడా సినిమాల ద్వారా, యాడ్స్ ద్వారా, వ్యాపార రంగాల ద్వారా సంపాదించుకున్న ఆస్తుల విలువ సుమారుగా రూ.1685 కోట్లు అని సమాచారం. ఇందులో సైఫ్ అలీఖాన్ నికర ఆస్తులు విలువ రూ.1200 కోట్లు అని , కరీనా నికర ఆస్తి విలువ రూ.485 కోట్లు అని తెలుస్తోంది. ఇక అలాగే వీరిద్దరూ కలిసి ముంబైలోని బాంద్రాలో ఉన్న రూ.103కోట్ల విలువైన సద్గురు శరన్ అనే అపార్ట్మెంట్ ను కొనుగోలు చేశారు. అలాగే స్విట్జర్ ల్యాండ్ లో 33 కోట్ల విలువైన చాలెట్ ని కూడా సొంతం చేసుకున్నారు. ఏది ఏమైనా కష్టార్జితంతో పాటు వారసత్వంగా వచ్చిన ఆస్తులు వీరిని అత్యంత ధనవంతులుగా మార్చేశాయని అభిమానులు సైతం కామెంట్ చేస్తున్నారు.

# తండ్రి కట్ చేసిన సీన్‌ను దొంగచాటుగా కలిపిన హృతిక్!

'కహో నా ప్యార్ హై' ఎడిటింగ్ సమయంలో తనకు నచ్చిన ఓ షాట్‌ను తండ్రి రాకేష్ రోషన్ తొలగించడంతో హృతిక్ రోషన్ అందోళన చెందారట. కొడుకు అన్న ప్రేమతో అనవసరమైన షాట్లను పొడిగించడం రాకేష్ రోషన్‌కు అస్సలు ఇష్టం ఉండదని.. సినిమాను నిష్పక్షపాతంగా ఎడిట్ చేసేవారని హృతిక్ తెలిపారు. ఎడిటింగ్ సమయంలో తన మీద ఉన్న మంచి షాట్‌ను కూడా తండ్రి కట్ చేయడం చూసి హృతిక్ లోలోపల ఎంతో కలవరపడ్డారట. తాను ఎంతో కష్టపడి నటించిన ఆ షాట్‌ను సినిమా నుంచి తొలగించడంతో ఏం చేయాలో తెలియక మనసులో ఆందోళనట్లు హృతిక్ గుర్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే హృతిక్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. తండ్రి ఎడిటింగ్ రూమ్ నుంచి ఇంటికి వెళ్లిన అనంతరం హృతిక్ సైలెంట్ గా ఆటో ఎక్కి ఎడిటింగ్ స్టూడియోకి వెళ్లారు. తన దగ్గర ఉన్న స్టూడియో తాళాలతో లోపలికి వెళ్లి తండ్రి కట్ చేసిన తన ఫేవరెట్ షాట్‌ను మళ్లీ ఎడిటింగ్ టేబుల్ పైకి తెచ్చి యథావిధిగా కలిపారు. ఆ షాట్ సినిమాకు ప్లస్ అవుతుందా లేదా అని అక్కడ ఉన్న ఎడిటర్‌ను అడిగి నిర్ధారించుకున్న తర్వాతే హృతిక్ ఊపిరి పీల్చుకున్నారు. అయితే మరుసటి రోజు ఉదయం రాకేష్ రోషన్ మళ్లీ ఆ సీన్‌ను స్టూడియోలో పరిశీలించారు. తాను కట్ చేసిన షాట్ మళ్లీ సినిమాలో ఉండటం చూసి రాకేష్ రోషన్ మౌనంగా ఆలోచించి –సరే పర్వాలేదు ఇది బాగుంది– అని వదిలేసేరట. ఇది హృతిక్ చేసిన పనే అని తెలిసినా రాకేష్ ఏమీ అనలేదుట. తన ఇష్ట ప్రకారం కానియండని సిబ్బందికి సూచించారుట. ఆ రకంగా కుమారిడిపై ప్రేమను రాకేష్ మరోసారి చాటుకున్నారు. హృతిక్ బాలీవుడ్ లో అంత పెద్ద స్టార్ అయ్యారంటే? కారణం రాకేష్ రోషన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆయన సూచనలు..సలహాలతోనే స్టార్ గా ఎదిగారు. రాకేష్ రాసిన కథలు..తీసిన సినిమాలతోనే ఖాన్ త్రయానికి గట్టి పోటీనిచ్చారు. ప్రస్తుతం హృతిక్ సైతం సొంతంగా కథలు..సినిమాలు డైరెక్ట్ చేసే స్థాయికి చేరుకున్నారు. క్రిష్ –4 చిత్రానికి సంబంధించి క్రియేటివ్ పరంగా ఆయన ఇన్వాల్వ్ మెంట్ ఎంతో ఉంది.



తండ్రి స్టూడియో నుంచి వెళ్లిపోయాక ఆటోలో ఎడిటింగ్ రూమ్‌కు వెళ్లి ఆ షాట్‌ను మళ్లీ సినిమాలో చేర్చారు. మరుసటి రోజు అది చూసిన రాకేష్ రోషన్ కూడా అంగీకరించారట. బాలీవుడ్ గ్రీకు వీరుడు హృతిక్ రోషన్ తొలి సినిమా –కహో నా ప్యార్ హై– సృష్టించిన సంచలనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైన చిత్రం హృతిక్‌ను ఒక్క రాత్రిలో దేశవ్యాప్తంగా ఓవర్ నైట్ స్టార్‌గా మార్చేసింది. అయితే ఈ సినిమా బ్లాక్‌బస్టర్ విజయం వెనుక పాటలు, దర్శకత్వ ప్రతిభే కాకుండా ఓ ఆసక్తికరమైన సీక్రెట్ దాగి ఉందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హృతిక్ రోషన్ ఈ సినిమా ఎడిటింగ్ సమయంలో జరిగిన ఓ మలుపును తాజాగా రివీల్ చేసారు. –కహోనా ప్యార్ హై– నిర్మాణ సమయంలో దర్శకుడు, తండ్రి అయిన రాకేష్ రోషన్ ఎడిటింగ్ రూమ్‌లో ఎంత కఠినంగా ఉంటారో? హృతిక్ వివరించారు.

# 'ఓజి' సిరీస్ పై థమన్ బిగ్ అప్డేట్..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన రీసెంట్ హిట్ చిత్రమే 'ఓజి'. చాలా ఏళ్ల తర్వాత ఓజి సినిమాతో పవన్ క్రేజ్ అంటే ఏంటో రివీల్ అయ్యింది. నెక్స్ట్ లెవెల్ యుఫోరియాతో విడుదల అయ్యిన ఈ సినిమా పవన్ అభిమానుల్లో ఒక ప్రత్యేక స్థానాన్ని కూడా సొంతం చేసుకోగా ఈ సిరీస్ పై సంగీత దర్శకుడు థమన్ ఇచ్చిన బిగ్ అప్డేట్ ఇప్పుడు వైరల్ గా మారింది.సుజీత్ పార్ట్ 2 స్క్రిప్ట్ ని స్పీకర్స్ పగిలిపోయే రేంజ్ లో రాసుకున్నాడని రివీల్ చేసాడు. అంతే కాకుండా ఓజి 2 మాత్రమే కాదు ఓజి 3 కూడా ఉంది అంటూ ఈ సిరీస్ పై బిగ్ అప్డేట్ ని అందించాడు. దీనితో ఓజి ఫ్యాన్స్ మాత్రం ఈ సిరీస్ విషయంలో ఓ రేంజ్ లో ఎగ్జైట్ అవుతున్నారు. కానీ ఈ రెండు సినిమాలు పూర్తి చేసే స్కోప్ పవన్ నుంచి ఎప్పటికి ఉంటుంది అనేదే అసలు ప్రశ్న. ఇక పార్ట్ 2 విషయానికి వస్తే పవన్ కళ్యాణ్ నే నిర్మాణం వహిస్తుండగా సుజీత్ బ్లడీ రోమియో తర్వాత ఈ సినిమా పట్టాలెక్కనుంది




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY DHEEKONDA SHIVAKRISHNA, PRINTER TELUKALA BHASKAR REDDY, PRINTED AT RAINBOW OFFSET PRINTERS, 6-8-142, SAGARA VEEDHI CHOWRASTHA, HANUMAKONDA, WARANGAL, TELANGANA-506001. PUBLISHED AT: H.NO: 7-37, ZAFFERGADH ROAD, WARDHANNAPET, WARANGAL, TELANGANA- 506313.
EDITOR: DHEEKONDA SHIVAKRISHNA. PRGI NO: TGTEL/25/A0438, CELL: 9700950084, 9948206302, email: startrinethram28@gmail.com